సాక్షి
ములుగు

బుధవారం | 22 | మే | 2024



భక్తిభావం.. హనుమధ్యానం

వైశాఖమాసం హనుమాన్ దీక్షా సమయం కావడంతో దేవాలయాలన్నీ ఉదయం, సాయంత్రం మాలధారులతో సందడిగా మారుతున్నాయి. - 8లో▸



నవీన్ కన్నీటిధారలే 'అనురాగ దీపం'

అంపశయ్య నవీన్ కన్నీటిధారలే అనురాగ దీపం నవల ఇతివృత్తమని ప్రముఖ సాహితీవేత్త గంటా రామిరెడ్డి అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$39^0/27^0$

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉండి వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది

న్యూస్‌రీల్

వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఎదిర ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 74 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. 12 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తునికాకు కూలీలపై తేనెటీగల దాడి



ఎస్‌ఎస్‌తాడ్వాయి: అడవిలోకి తునికాకు సేకరణకు వెళ్లిన కూలీలపై తేనెటీగలు మంగళవారం దాడి చేశాయి. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన కూలీలు ఆకు సేకరణకు ట్రాక్టర్‌లో సుమారుగా 40 మంది కూలీలు అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. ఆకు సేకరించి ట్రాక్టర్ దగ్గరకు వచ్చిన కూలీలపై తేనెటీగలు దాడి చేయగా కూలీలు అడవిలో పరిగెత్తారు. మధ్యాహ్నం 2గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఈ తేనెటీగల దాడిలో సుమారుగా 15మంది కూలీలు గాయపడ్డారు. అటవీశాఖ అధికారులు, తునికాకు కాంట్రాక్టర్ గాయపడిన కూలీలకు వైద్య ఖర్చులు చెల్లించాలని కోరుతున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు




మహాముత్తారం: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ మధుసూదన్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బంది పనితీరుపై వైద్యాధికారి సందీప్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రామింగ్ ఆఫీసర్లు శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్, సీహెచ్‌ఓ విద్యాసాగర్, వైద్యసిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: జిల్లాలో బెస్ట్ అవెలబుల్ స్కీం కింద 3వ, 5వ, 8వ తరగతుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చిత్రమిశ్రా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం గ్రామాల వారికి రూ.1.50 లక్షలలోపు, పట్టణాల వారికి రూ.2లక్షల లోపు ఉండాలన్నారు. విద్యార్థులను డ్రా పద్ధతిన ఎంపిక చేస్తారని చెప్పారు. దరఖాస్తులను జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో నేటినుంచి జూన్ 6వ తేదీ వరకు చేసుకోవాలన్నారు.

ఇసుక లారీల పట్టివేత



కాటారం: అనుమతులు లేకుండా మహదేవపూర్ మండలం అన్నారం క్వారీ నుంచి ఇసుక తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గంగారం క్రాస్ రోడ్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇసుక లారీ డ్రైవర్ పోలీసులను గమనించి అక్కడే వదిలిపెట్టి పారిపోయాడు. మరో లారీ అనుమతులు లేకుండా తరలిస్తుండగా పట్టుకున్నారు. లారీ డ్రైవర్ గంధమల్ల మధుతో పాటు లారీ ఓనర్ గోవర్ధన్‌పై కేసు నమోదు చేశారు. మరో లారీ డ్రైవర్, యజమాని వివరాలు తెలియలేదని ఎస్సై పేర్కొన్నారు.

మూడు లారీలకు జరిమానా..

మహదేవపూర్ మండలం అన్నారం ఇసుక క్వారీ నుంచి ఓవర్‌లోడ్‌తో ఇసుక తరలిస్తున్న మూడు లారీలను మంగళవారం అర్ధరాత్రి పట్టుకొని జరిమానా విధించినట్లు ఆర్టీఏ సంధాన్ తెలిపారు. ఇసుక లారీలు ఓవర్‌లోడ్‌తో వెళ్తున్నాయనే సమాచారం మేరకు దాడులు చేసి మూడు ఓవర్‌లోడ్ లారీలను పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పట్టభద్రులు 10,299

ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓటుహక్కు వినియోగించుకోనున్న గ్రాడ్యుయేట్లు

- వివరాలు వెల్లడించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలు.. ఏడు రూట్లు



నాయకుల అభిప్రాయాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ములుగు: జిల్లాలోని తొమ్మిది మండలాల్లో 10,299 మంది పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకున్నారు. ఇందులో 6,587 మంది పురుషులు, 3,712 మంది మహిళలు ఉన్నారు. వీరంతా ఈ నెల 27వ తేదీన నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తమ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జిల్లాలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూం నంబర్ 4,5,8, జంగాలపల్లి జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్, వెంకటాపురం (ఎం) మండల కేంద్రంలో జిల్లా పరిషత్ హైస్కూల్ మీటింగ్ హాల్, జిల్లా పరిషత్ హైస్కూల్ 6వ తరగతి గది, గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు, ఎస్ఎస్‌తాడ్వాయి మండలకేంద్రంలో ప్రభుత్వ ఆశ్రమ బాలికల హైస్కూల్, ఏటూరునాగారం జెడ్పీహెచ్ఎస్ రూం నంబర్ 1, 3, కన్నాయిగూడెం ప్రభుత్వ ఆశ్రమ బాలుర హైస్కూల్, మంగపేట జిల్లా పరిషత్ సెకండరీ స్కూల్ 10వ తరగతి గది, జిల్లా పరిషత్ హైస్కూల్ 6వ తరగతి గది, వాజేడు జెడ్పీహెచ్ఎస్ నూతన భవనం, వెంకటాపురం(కె) జిల్లా పరిషత్ హైస్కూల్, ఆలుబాక జిల్లా పరిషత్ హైస్కూల్ ఉన్నాయి.



ఏడు రూట్లకు అధికారుల నియామకం

17 కేంద్రాల్లో జరిగే పోలింగ్ ప్రాంతాలను 7రూట్లుగా ఏర్పాటు చేశారు. వీటికి గానూ సెక్టార్/జోనల్ అధికారులను నియమించారు. పోలింగ్ కేంద్రం 195, 196, 197కు ములుగు ఎంపీడీఓ రామకృష్ణ (సెల్ నంబర్ 9281484775), 198, 201, 202 పోలింగ్ కేంద్రాలకు వెంకటాపూరం(ఎం) తహసీల్దార్ సదానందం(9849277252), 199, 200, 203 పోలింగ్ కేంద్రాలకు గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్‌కుమార్(9985340260), 204, 205, 206 పోలింగ్ కేంద్రాలకు ఏటూరునాగారం తహసీల్దార్ జగదీశ్వర్(9440450824), 207, 208 పోలింగ్ కేంద్రాలకు కన్నాయిగూడెం తహసీల్దార్ ఎండీ సలీం(7093116900), 209 పోలింగ్ కేంద్రానికి వాజేడు ఎంపీడీఓ విజయ(8309122619), 210, 2011 పోలింగ్ కేంద్రాలకు వెంకటాపురం(కె) ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్(8978180090)లను నియమించారు.

కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ కేంద్రం

ఎన్నికల విధులు నిర్వహించనున్న అధికారులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి కలెక్టరేట్‌లో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఫారం 12 ద్వారా దరఖాస్తు చేసుకొని పోస్టల్ బ్యాలెట్ తీసుకున్న వారు నేటి నుంచి 26వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9గంటల వరకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి సూచించారు. 26న పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ఉద్యోగులకు మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. అదే రోజు కేంద్రానికి చేరుకొని 27న ఉదయం పోలింగ్‌కు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి..

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉదయం 8నుంచి 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. 52 అభ్యర్థులు పోటీలో ఉన్నారని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఖాళీగా ఉన్న బాక్స్‌లను చూపిన అనంతరం ఓటింగ్‌కు వెళ్తామన్నారు. మొత్తం ప్రక్రియను వీడియో తీస్తామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందును రాజకీయ పార్టీలు కులం, మతం, ప్రాంతాలపై విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినా, తప్పుడు ప్రచారాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికను సమర్థవంతంగా నిర్వహించాలి

ఎమ్మెల్సీ ఉప ఎన్నికను సమర్థవంతంగా నిర్వహించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల సంఘం విధివిధానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. బ్యాలెట్ పేపర్‌తో ఓటింగ్ జరగనున్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పీఓ, ఏపీఓల ట్రైనింగ్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి

కేయూ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ

నేడు బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారిణి వాకాటి కరుణను నియమించారు. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ పదవీకాలం మంగళవారంతో ముగిసింది. కొత్త వీసీ నియామకానికి కొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఇన్‌చార్జ్ వీసీగా కరుణను నియమించారు. ప్రస్తుతం ఆమె మహిళా శిశు దివ్యాంగుల, సీనియర్ సిటిజన్ శాఖ సెక్రటరీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గతంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు జాయింట్ కలెక్టర్ మూడున్నరేళ్లు పనిచేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక 2015-2016లో వరంగల్ అర్బన్ కలెక్టర్‌గా పనిచేశారు.

భూముల అన్యాక్రాంతంపై అప్పట్లోనే దృష్టి

కలెక్టర్‌గా వాకాటి కరుణ ఉన్న సమయంలో కాకతీయ యూనివర్సిటీలో భూముల అన్యాక్రాంతంపై దృష్టి సారించారు. పలుచోట్ల వర్సిటీ భూములకు సంబంధించిన హద్దుల వద్ద బోర్డులు పెట్టించారు. ఇప్పుడు ఇన్‌చార్జ్ వీసీగా రానుండడంతో భూముల ఆక్రమణలకు సంబంధించిన వ్యవహారంపై మళ్లీ దృష్టి సారిస్తారా లేదా అనేది వేచి చూడాల్సిందే. కొంతకాలం క్రితమే ల్యాండ్ కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలించి అందులో ఏముందో బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నేడు బాధ్యతల స్వీకరణ?

కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీగా వాకాటి కరుణ బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. వీసీ తాటికొండ రమేష్ పదవీకాలం ముగిసింది. ఆమెకు చార్జ్ అప్పగించాల్సింటుంది. ఇందుకు ఆయన హైదరాబాద్‌కు వెళ్తారా లేక చార్జ్ ఇచ్చినట్లుగా లెటర్‌పై సంతకం చేసి ఇస్తారా అనేది వేచి చూడాలి. ఒకవేళ చార్జ్ ఇచ్చే విధంగా లెటర్‌పై సంతకం రమేష్ చేసిస్తే రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి తీసుకెళ్లి ఆమెకు అందించనున్నారు. ఈ మేరకు మల్లారెడ్డి మంగళవారం రాత్రి వీసీ రమేష్‌తో మాట్లాడేందుకు వెళ్లినట్లు తెలిసింది.

పనులు త్వరగా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కన్నాయిగూడెం: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మండల పరిధిలోని జింగారం, ఏటూరు, కంతనపల్లి గ్రామాల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతులను మండల అధికారులతో కలిసి పరిశీలించారు. పాఠశాలలోని గదులు, మరుగుదొడ్లు, రూమ్‌లు, తరగతి గదుల్లో ఏర్పాటు చేసిన ఫ్యాన్‌లను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీలతో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభం నాటికి నూతన ఒరవడితో ఏర్పాటు చేయాలన్నారు. పనులపై అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. పనులపై ఎప్పటికప్పుడు రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. వీరి వెంట ఎంపీడీఓ అనిత, ఎంఈఓ రాజేష్, ఎంపీఓ రామకృష్ణ, మంగపేట ప్రత్యేక అధికారి వెంకటనారాయణ, పంచాయతీ ఏఈ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు స్పెషల్ బస్ సర్వీస్ ప్రారంభం



హనుమకొండకు వెళ్తున్న బస్సు

మంగపేట: మల్లూరు హేమాచల క్షేత్రంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం హనుమకొండ 2 డిపో బస్ సర్వీస్ సౌకర్యాన్ని మంగళవారం నుంచి ప్రారంభించింది. ఉదయం 6గంటలకు హనుమకొండ నుంచి బస్సు బయలుదేరి మల్లూరుగుట్టపైకి వస్తుందని మంగపేట బస్టాండ్ కంట్రోలర్ శంకర్ తెలిపారు. అనంతరం గుట్ట నుంచి ఏటూరునాగారం వరకు 8 ట్రిప్పులు సర్వీస్ ఉంటుందన్నారు. సాయంత్ర 6 గంటల నుంచి మల్లూరుగుట్ట నుంచి హనుమకొండకు బయలుదేరి వెళ్తుందన్నారు. హనుమకొండ నుంచి మల్లూరుకు బస్‌చార్జీ రూ. 200, మల్లూరు నుంచి ఏటూరునాగారానికి రూ.40చార్జీ ఉంటుందని తెలిపారు.

తిరుగువారం పండుగ



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారికి బోనం సమర్పిస్తున్న మహిళలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. మండలంలోని గౌడ కులస్తులంతా అమ్మవారికి బోనం సమర్పించి దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేకలు, కోళ్లను బలిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పలు రకాల నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో తాళ్లపెల్లి నర్సింహులు, మోహన్ గడ్డం మహేష్, కూనూరు అశోక్, మహేష్, సప్పిడి రాము, రాంనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

ములుగు: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలో పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా ముఖ్యఅతిథిగా హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశంలో శాస్త్ర సాంకేతిక రంగాన్ని తీసుకొచ్చిన ఘనుడు రాజీవ్‌గాంధీ అన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించిన గొప్పనాయకుడు అని ఆయన సేవలను కొనియాడారు. ఆయన మృతి చెందిన దినాన్ని తీవ్రవాద వ్యతిరేఖ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి, నాయకులు బాదం ప్రవీణ్‌కుమార్, శ్యాం, తిరుపతి, కంబాల రవి, రేవంత్‌యాదవ్, బోడ రఘు, ఓరుగంటి అనిల్, పొడాల ఓంప్రకాశ్, బోయిని రాజు, ఎల్లావుల అశోక్, బోడ సతీశ్, బండి మధు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నారం బ్యారేజీ వద్ద తనిఖీలు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం బ్యారేజీ వద్ద ఎస్సై భవానిసేన్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాలకు వచ్చి వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానా విదించారు. అనుమానితులను విచారించి వదిలేశారు.

వైభవంగా ధ్వజారోహణం

మల్లూరులో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యాగ్నిక పూజారుల బృందం



అగ్నిప్రతిష్ట, సుదర్శన హోమం నిర్వహిస్తూ..



గరుడ ప్రసాదాన్ని స్వీకరిస్తున్న మహిళలు



మెట్ల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

మంగపేట: మండల పరిధిలోని మల్లూరులో గల శ్రీహేమాచలక్షేత్రంలో లక్ష్మీనర్సింహస్వామివారి బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. మూడోరోజు మంగళవారం యాగ్నికులు మురళీకృష్ణమాచార్యుల బృందం ధ్వజారోహణం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి యాగశాలలో యాగ్నికుల బృందం అగ్నిప్రతిష్ఠాపన, సుదర్శన హోమం వేద మంత్రోచ్చరణ నడుమ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని పంచముఖ ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. 11గంటలకు యాగశాలలోని ధ్వజపటాన్ని మంగళవాయిద్యాలతో వేదపండితులు తీసుకువచ్చి ధ్వజస్తంభం వద్ద వేదమంత్రోచ్చరణల నడుమ పూజలు నిర్వహించి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం యాగశాలలో భేరీపూజ, దేవతాహ్వానం, బలిహరణ పూజా కార్యక్రమాలను జరిపించారు.

గరుడప్రసాదం పంపిణీ

బ్రహ్మోత్సవాలు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమం అనంతరం దంపతులకు సంతానార్థం గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆలయంలో స్వయంభు స్వామివారి నాభి చందన ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీనిలో భాగంగానే బ్రహ్మోత్సవాల్లో భక్తులకు గరుడ ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో గరుడ ప్రసాదం కోసం నూతనంగా వివాహమైన వారితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంపతులు ధ్వజారోహణ కార్యక్రమంలో అత్యంత భక్తిశ్రద్ధలతో పాల్గొని గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. ఈనెల 27న మరోసారి భక్తులకు గరుడప్రసాదాన్ని అందజేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు మధనమోహన్, రామనర్సింహా, మణిదీప్, వెంకటాచార్యులు, భరద్వాజ్, అభిరామ్, విరంచి, పూజారులు కైంకర్యం రాఘవాచార్యులు, శేఖర్‌శర్మ, పవన్‌కుమార్, ఆలయ సీనియర్ అసిస్టెంట్ సీతారామయ్య, సిబ్బంది శేషు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

బ్రహ్మోత్సావాల్లో(జాతరలో) భక్తుల ఏర్పాట్లపై కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం పరిశీలించారు. మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కృష్ణ ప్రసాద్ సంబంధిత అధికారులతో కలిసి ఆలయ ప్రాంగణంలో జాతర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణ అధికారి శనిగల మహేష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈనెల 28 వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు కల్పించిన చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, మరుగదొడ్లు, మూత్రశాలలు వంటి సౌకర్యాలను అడిగి తెలుసుకుని ఆయా సౌకర్యాలను పర్యవేక్షించారు. వారి వెంట ఎంపీఓ మమత, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. అదే విధంగా రేపటి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవానికి వేల సంఖ్యలో భక్తులు తరలి రానుండటంతో ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఆలయాన్ని ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ బాబాసాహెబ్ సీఐ రాజు, స్థానిక ఎస్సై రవికుమార్‌తో కలిసి మంగళవారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను కలియతిరిగి ఆలయ కార్యనిర్వహణ అధికారితో పలు అంశాలపై చర్చించారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 60 నుంచి 70 మంది వరకు సివిల్, సీఆర్‌పీఎఫ్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఆర్టీసీ బస్సు గుట్టపైకి వచ్చిపోయే విదంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే భక్తుల వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలు సిద్ధం చేశామని తెలిపారు. అనంతరం ఆయన ఆలయంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

సీఈఐఆర్‌తో ఫోన్ రికవరీ సులభం

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



వరంగల్ క్రైం : సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేస్తే పోయిన సెల్‌ఫోన్‌ను తిరిగి పొందే అవకాశం ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో పోగొట్టుకున్న వారి సెల్‌ఫోన్లను సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 142 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఎవరైతే మొబైల్ పోగొట్టుకున్నారో వారు మొదట అదే నంబర్‌తో కొత్త సిమ్ తీసుకొని, మీ సేవలో మొబైల్ లాస్ట్ అప్లికేషన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం www.ceir.gov.in లో రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్/స్టోలెన్ మొబైల్ లింక్‌ను క్లిక్ చేయాలి. పోయిన సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్, కంపెనీ పేరు, మోడల్, కొనుగోలు చేసిన రశీదు, మీ సేవ దరఖాస్తు రశీదు నంబర్‌ను అప్‌లోడ్ చేయాలన్నారు. మొబైల్ ఏ రోజు, ఎక్కడ పోయింది, రాష్ట్రం, జిల్లా, పోలీస్ స్టేషన్ వివరాలు, చివరగా వినియోగదారుడి పేరు, చిరునామా, గుర్తింపుకార్డు, ఈ మెయిల్ ఐడీ వివరాలు నమోదు చేయాలన్నారు. అనంతరం పోయిన మొబైల్ బ్లాక్ అవుతుందని, ఇదంతా పూర్తయిన తర్వాత తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పేర్కొన్నారు. పోగొట్టుకున్న తమ సెల్‌ఫోన్లను తిరిగి అందజేసినందుకు యజమానులు సీపీకి కృతజ్ఞతలు తెలిపారు. సీసీఆర్‌బీ ఏసీపీ డేవిడ్‌రాజ్, ఐటీ కోర్ విభాగం హెడ్ కానిస్టేబుల్ మాధవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

కాశిబుగ్గ: రైలు కింద పడి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన వరంగల్, చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం ఏనుమాముల ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన గుండా యాదగిరి(62) ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేస్తూ రెండు సంవత్సరాల క్రితం రిటైర్డ్ అయ్యాడు. రెండు నెలల క్రితం తన చిన్న కుమారుడు రామకృష్ణకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో తన వద్ద ఉన్న రూ. 8 లక్షలతో ఆపరేషన్ చేయించాడు. దీంతో యాదగిరి వద్ద డబ్బు అయిపోయింది. కాశిబుగ్గ జంక్షన్‌లో పెద్ద కుమారుడు కృష్ణతో కలిసి పాన్ షాపులో పనిచేస్తున్నాడు. తన వద్ద డబ్బు అయిపోయిందని, రిటైర్డ్ అయినా రోజూ పని చేయాల్సి వస్తోందని బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం బయటకు వెళ్తున్నానని పెద్ద కుమారుడు కృష్ణకు చెప్పాడు. షాపు నుంచి బైక్‌పై లేబర్‌కాలనీలో ఉంటున్న మేనల్లుడి వద్దకు వెళ్లాడు. అక్కడ బైక్ పార్క్ చేసి జాన్‌పీరీలు గేట్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ పి రాజు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పెద్ద కుమారుడు కృష్ణకు అప్పగించామని జీఆర్పీ సీఐ తెలిపారు.

అందరూ ఒకే కుటీరంలో ఉండడం.. స్వయంపాకం చేసుకోవడం.. రోజుకొకరు తమ ఇండ్లలో పూజలు.. ఆలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో అభిషేకాలు, భజనలు, కీర్తనలు.. ఇవి ప్రస్తుతం గ్రామాల్లో కనిపిస్తున్న ఆధ్యాత్మిక పరిమళాలు. వైశాఖమాసం హనుమాన్ దీక్షా సమయం కావడంతో దేవాలయన్నీ ఉదయం, సాయంత్రం మాలధారులతో సందడిగా మారుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భక్తులు పెద్ద ఎత్తున హనుమాన్ మాలధరిస్తున్నారు. ఫలితంగా జై హనుమాన్..జై శ్రీరాం నామసంకీర్తనలతో పల్లెలు, పట్టణాలు మార్మోగుతున్నాయి.

- గూడూరు/గోవిందరావుపేట

గూడూరు: దీక్ష ముగించుకుని కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ మాలధారులు (ఫైల్)



భక్తిభావం.. హనుమధ్యానం..

జై హనుమాన్, జై శ్రీరాం నామసంకీర్తనలతో మార్మోగుతున్న గ్రామాలు

- కొనసాగుతున్న హనుమాన్ మాలధారుల దీక్షలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో పెద్ద ఎత్తున స్వీకరిస్తున్న భక్తులు
- జూన్ 1న హనుమాన్ జయంతితో ముగింపు

పలు ఆలయాల సందర్శన..

చిన్న హనుమాన్ జయంతికి ముందు నుంచే మాలధారులు పలు ఆలయాలు సందర్శిస్తున్నారు. కొందరు హనుమాన్, ఇతర దేవాలయాల్లో దీక్షా కాలం గడుపుతున్నారు. కొందరు తమ పిల్లలకు కూడా హనుమాన్ మాల ధరింపజేసి ఆధ్యాత్మిక చింతన అలవరుస్తున్నారు. దీక్ష పాటిస్తూ వృత్తి ధర్మం నెరవేరుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పెద్ద హనుమాన్ జయంతి జూన్ 1వ తేదీన కావడంతో మండల కాలం (41) రోజులు మాలధారణ పూర్తయిన మాలధారులు ఇరుముడి కట్టుకుని కరీంనగర్ జిల్లా కొండగట్టు, ఇతర హనుమాన్, ఇతర పుణ్యక్షేత్రాలకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. మొదటిసారి మాలధారులు ఎక్కువ కొండగట్టు దర్శించుకుంటారు. కాగా, చివరి మూడు రోజులు మాలధారులు ఆయా గ్రామాల్లోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో రామనామం, చాలీసా పారాయణం, నగర సంకీర్తన శోభయాత్ర (దేవుడి ఊరేగింపు) చేసి హనుమాన్ జయంతి రోజు మహా అన్నదానం చేపడుతారు. అనంతరం భద్రాచలం, ఇతర ఆలయాలకు వెళ్లి మాల విరమణ చేయడంతో దీక్ష పూర్తవుతుంది.



గోవిందరావుపేట: ఆంజనేయ స్వామి విగ్రహానికి చందనం వేస్తున్న హనుమాన్ మాలధారులు

30 సంవత్సరాల నుంచి మాలధారణ

గోవిందరావుపేట మండలం చల్వాయిలో 30 సంవత్సరాల నుంచి 150 నుంచి 200 మంది హనుమాన్ మాలధరిస్తున్నారు. కరోనా సమయంలో కూడా అధికారుల అనుమతి తీసుకుని కొందరు హనుమాన్ మాలధారణ చేపట్టారంటే గ్రామంలో భక్తి భావం ఎంత ఉందో ఊహించుకోవచ్చు. కులం, గోత్రం, చిన్న, పెద్ద అని తేడా లేకుండా హనుమాన్ మాలధారణ చేసి అందరూ భక్తిశ్రద్ధలతో దీక్ష చేపడుతారు. దివంగత ఏనుగుల విష్ణువర్ధన్ గురుస్వామితోనే ఈ ఐకమత్యం ఇప్పటికీ కొనసాగుతుందని భక్తుల నమ్మకం. గురుస్వామి విష్ణు కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి వారసత్వాన్ని మూల కుమారస్వామి కొనసాగిస్తున్నారు.

మొదటిసారి మాలధరించా



మొదటిసారి హనుమాన్ మాలధరించిన వారిని కన్నెస్వామి అంటారు. ఆంజనేయస్వామిని ఆరాధిస్తే బుద్ధి, బలం సిద్ధిస్తాయని నమ్మి మాలధరించా. దీక్షా కాలం ఆనందంగా ఉంది. శారీరక, మానసిక ప్రశాంతత కలుగుతుంది.

- వడ్లకొండ బాలకృష్ణ, కన్నెస్వామి, గూడూరు

23 సంవత్సరాలుగా మాలధరిస్తున్నా



23 సంవత్సరాలుగా హనుమాన్ మాలధరిస్తున్నా. వృత్తిపరంగా గీత కార్మికుడిని. రోజు పూజలు ముగిసిన అనంతరం వృత్తి కొనసాగిస్తా. మండలంలో ఎక్కువ సార్లు మాలవేసుకుంది నేనే. 20 మంది మాలధారులతో కుటీరం ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తాం. దీక్షతో ఆరోగ్యం, ఆనందం, ఆహ్లాదం కలుగుతున్నాయి.

- మేరుగు మల్లయ్యగౌడ్, గురుస్వామి, గూడూరు

దీక్షలో ఉన్నంత కాలం అద్భుతంగా ఉంటుంది



గ్రామంలో 30 సంవత్సరాల నుంచి హనుమాన్ మాలధారణ జరుగుతోంది. ఏటా 150 నుంచి 200 మంది వరకు మాలధారణ చేస్తుంటారు. అందరూ ఒకే దగ్గర ఉండి క్రమశిక్షణ, నిష్ఠతో దీక్ష చేపడుతారు. ఈ సమయంలో హనుమాన్ దేవుడే మీద కుర్చున్నాడా అని అనిపిస్తుంది. అద్భుతంగా గడుస్తుంది.

- మూల కుమారస్వామి, గురుస్వామి, చల్వాయి, గోవిందరావుపేట

వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయం

- కేయూ రిజిస్ట్రార్‌తో అకుట్ బాధ్యుల వాగ్వాదం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయమయ్యాయని కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) జనరల్‌సెక్రటరీ మామిడాల ఇస్తారి ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం సంఘం బాధ్యులతో కలిసి రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీసీ రమేశ్‌పై ప్రభుత్వం ఇటీవల విజిలెన్స్ విచారణకు ఆదేశించిందన్నారు. ఈ నేపథ్యంలో వీసీ మూడు రోజుల నుంచి యూనివర్సిటీకి రావడం లేదన్నారు. అయితే ఈనెల 20న వీసీ లాడ్జ్‌నుంచి పలు ఫైళ్లు బయటకు తీసుకెళ్లారని ఆరోపించారు. ఈ అంశంలో సీసీ పుటేజీ పరిశీలించాలని డిమాండ్ చేస్తూ రిజిస్ట్రార్‌తో వాగ్వాదానికి దిగారు. వీసీ లాడ్జ్ నుంచి తరలించిన ఫైళ్లలో పలు మార్పులు చేసే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన పార్ట్‌టైం, ఫుల్‌టైం అడ్మిషన్లకు సంబంధించి ఫైళ్లు, విద్యార్థులకు వచ్చిన మార్కులు లిస్టు, కంప్యూటర్ కొనుగోళ్లకు సంబంధించిన అప్రూవల్ ఆర్డర్లను మార్చేఅవకాశం ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అకుట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్, డాక్టర్ బ్రహ్మేశ్వరి, డాక్టర్ ఎం శ్రీనివాస్, కిశోర్‌కుమార్, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కేయూ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఇస్తారి తెలిపారు.



రిజిస్ట్రార్ మల్లారెడ్డితో వాగ్వాదం చేస్తున్న అకుట్ బాధ్యులు

సీసీ పుటేజీ పరిశీలిస్తాం

వీసీ లాడ్జ్ నుంచి ఫైళ్లు మాయమయ్యాయనే ఆరోపణలపై రిజిస్ట్రార్ మల్లారెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా లాడ్జ్‌లో ముఖ్యమైన ఫైళ్లు ఏమిలేవన్నారు. రొటీన్‌కు సంబంధించిన పలు ఫైళ్లు ఉండొచ్చునని, అవి తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. వీసీ లాడ్జ్ వద్ద సీసీ పుటేజీ పరిశీలిస్తామని వివరణ ఇచ్చారు.

నవీన్ కన్నీటిధారలే 'అనురాగ దీపం'



నవలను ఆవిష్కరిస్తున్న గంట రామిరెడ్డి, అంపశయ్య నవీన్ తదితరులు

- ప్రముఖ సాహితీవేత్త గంట రామిరెడ్డి

విద్యారణ్యపురి: అంపశయ్య నవీన్ కన్నీటిధారలే అనురాగ దీపం నవల ఇతివృత్తమని ప్రముఖ సాహితీవేత్త గంట రామిరెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని పావడమ్స్ బ్లూ బాంక్వెట్‌హాల్‌లో నవీన్ లిటరరీ ట్రస్టు ఆధ్వర్యంలో అంపశయ్యనవీన్ సతీమణి అనసూయ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. అలాగే, అంపశయ్యనవీన్ తన సతీమణి అనసూయతో ఆరవై ఏళ్ల దాంపత్యజీవితంపై రచించిన 'అనురాగ దీపం' నవల ఆవిష్కరణ కార్యక్రమంలో రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నవీన్.. అనసూయతో తనకున్న గాఢమైన స్నేహబంధం, ప్రేమను ఉద్విగ్నభరితంగా ఈ నవలలో రాశారని కొనియాడారు. అనంతరం ప్రముఖ రచయిత నెల్లుట్ల రమాదేవి గ్రంథాన్ని సమీక్షిస్తూ.. నవీన్ తన అంతరంగాన్ని ఈ నవలలో అద్భుతంతంగా ఆవిష్కరించారని తెలిపారు. 60 ఏళ్ల దాంపత్యజీవితంలో తనను కంటికి రెప్పలా కాపాడుకున్న అనసూయ ఎడబాటును తట్టుకోలేని నవీన్ తన కన్నీళ్లను తన కలంలో ఇంకుగా రంగరించి రాసిన నవలే అనురాగదీపం అని తెలిపారు. ఈ నవల భార్యాభర్తల అన్యోన్య దాంపత్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈసభకు సాహితీవేత్త గన్నమనేని గిరిజామనోహరబాబు అధ్యక్షత వహించారు. ట్రస్టు కార్యదర్శి డి స్వప్న అమ్మంగివేణుగోపాల్, కె వరలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్, కవులు, సాహితీవేత్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్

- రూ.2.15 లక్షల విలువైన బైక్ స్వాధీనం

రామన్నపేట : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బైక్‌ల అపహరణకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చేసి రూ.2.15 లక్షల విలువైన బైక్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ టి.గోపి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా సంగడిగుంటకు చెందిన చాగంటి పవన్ తిరుమలేష్ కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు 30 మందిని నమ్మించాడు. వారి కొత్త బైక్‌లు చూసి తాను కూడా అలాంటి వాహనమే కొంటున్నానని చెప్పి ట్రయల్ చేస్తానని వాహనాల అపహరణకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈనెల 9వ తేదీన ములుగు రోడ్డులోని ఇండస్ట్రీయల్ ఏరియా వద్ద కామెర అరవింద్ అనే వ్యక్తి బైక్‌ను ట్రయల్ చేస్తానని చెప్పి అపహరించాడు. ఈ విషయంపై బాధితుడి ఫిర్యాదు మేరకు మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఎస్సైలు, క్రైమ్ టీమ్ కలిసి సదరు దొంగను అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి బైక్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించాలి

- విత్తన డీలర్ కేంద్రాలను రోజూ పర్యవేక్షించాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి

జనగామ రూరల్: క్షేత్రస్థాయిలో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించి రోజూ అధికారులు విత్తన డీలర్ కేంద్రాలను పర్యవేక్షించాలని, ఎరువుల కొరత లేకుండా చూసి రైతులకు సూచనలు చేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి అన్నారు. మంగళవారం జనగామ జిల్లా గానుగుపహాడ్ గ్రామ రైతువేదికలో 'రైతు నేస్తం' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌తో కలిసి రాష్ట్రంలో ఉన్న 33జిల్లాల వ్యవసాయ అధికారులతో వానాకాల పంటలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలం పంటలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, గ్రామాల్లో ఎప్పటికప్పుడు విత్తనాలు, ఎరువుల కేంద్రాలను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులు విడి విత్తనాలు కొనుగోలు చేయరాదని, ప్యాకింగ్ చేసినవి కొనుగోలు చేయాలన్నారు. విత్తనాల ఎంపికపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు రైతు వేదికల్లో పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. విత్తన కొనుగోలు చేసిన ప్యాకెట్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలన్నారు. ఎరువుల డీలర్లు తప్పనిసరిగా మూడు రకాల రిజిస్టర్లు నిర్వహించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. అధికారులు రోజూ ఆ రిజిస్టర్లు తనిఖీ చేసి నివేదికలు ఇవ్వాలన్నారు. అనంతరం రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఏఓ వినోద్‌కుమార్, డీసీఎస్ఓ రోజారాణి, డీఎంసీఎస్ ప్రసాద్, ఏడీఏ బీనా, ఏవో కర్నాకర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి.గోపి

ఈతకు వెళ్లి ఇద్దరి మృతి



విజయ్(ఫైల్)



ఆదాం(ఫైల్)

వరంగల్: ఏనుమాముల 14వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ సమీపంలోని ముసలమ్మకుంటలో ఈతకు వెళ్లిన ఇద్దరు నీటి మునిగి మృతి చెందారు. ఏనుమాముల సీఐ పులి రమేశ్ కథనం ప్రకారం.. దేశాయిపేటలో పెయింటర్లుగా జీవనం కొనసాగిస్తున్న జన్ను యేసు అలియాస్ విజయ్(40), జన్ను ఆదాం(36) మంగళవారం ఈత కొట్టేందుకు ముసలమ్మకుంటలోకి వెళ్లారు. ఈత కొడుతూ నీటిలో మునిగిపోవడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అదేరోజు మధ్యాహ్నం వరకు మృతదేహాలు పైకి తేలడంతో స్వాధీనం చేసుకుని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు. కాగా, విజయ్, ఆదాం.. వారం రోజుల నుంచి క్రమం తప్పకుండా ముసలమ్మకుంటలో ఈత కొడుతున్నట్లు స్థానికులు తెలిపారు.

బయ్యారంలో వాలీబాల్ క్రీడాకారుడు..

బయ్యారం: ఈతకు వెళ్లిన ఓ వాలీబాల్ క్రీడాకారుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం బయ్యారంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన జినక లక్ష్మీనారాయణ కుమారుడు గౌతమ్(14) మహబూబాబాద్‌లోని జ్యోతిబాపూలే గురుకులంలో 8వ తరగతి పూర్తి చేశాడు. చదువుతో పాటు వాలీబాల్ క్రీడలో ప్రతిభ కనబర్చడంతో జూన్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. ఈ క్రమంలో వేసవి సెలవులు కావడంతో వరుసకు సోదరుడయ్యే గణేశ్‌తో కలిసి సమీపంలో ఉన్న దామెరచెరువు వద్దకు ఈతకు వెళ్లాడు. ఈత కొడుతున్న సమయంలో గౌతమ్ నీటిలో మునగడంతో గణేశ్ భయంతో ఇంటికి వచ్చి బంధువులకు చెప్పాడు. వారు వెళ్లే సమయానికి గౌతమ్ మృతి చెందాడు. తల్లిదండ్రులు గుండలవిసేలా రోదించారు. కాగా, క్రీడల్లో రాణిస్తున్న గౌతమ్ చిన్న వయసులోనే మృతి చెందడం కుటుంబసభ్యులతో పాటు స్థానికుల్లోనూ విషాదంలో నింపింది.



గౌతమ్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఓరుగల్లుతో ఉన్న అనుబంధం గొప్పది

- ప్రముఖ సాహితీవేత్త, ప్రసార భారతి రిటైర్డ్ అదనపు డీజీ రేవూరి అనంత పద్మనాభరావు

హన్మకొండ కల్చరల్ : సాహితీవేత్తలకు నిలయమైన ఓరుగల్లుతో తనకున్న అనుబంధం గొప్పదని, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నానని ప్రముఖ సాహితీవేత్త, ప్రసారభారతి రిటైర్డ్ అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావు అన్నారు. వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతి సంవత్సరం ద్విశతావధాని దివంగత డాక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ స్మారకంగా అందజేస్తున్న సహృదయానుబంధ పురస్కారాన్ని రేవూరి అనంత పద్మనాభరావుకు అందజేశారు. కవితాప్రసాద్ జయంతి సందర్భంగా మంగళవారం రాత్రి హనుమకొండలోని వడ్డేపల్లిరోడ్డు పీఆర్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సహృదయ అధ్యక్షుడు గన్నమరాజు గిరిజామనోహరబాబు అధ్యక్షతన జరిగిన సభలో న్యూఢిల్లీ ఐసీహెచ్‌ఆర్ మాజీ అధ్యక్షుడు ఆచార్య యెల్లాప్రగడ సుదర్శన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంత పద్మనాభరావు మాట్లాడుతూ కాళోజీ, పేర్వారం జగన్నాథరావు, కవితాప్రసాద్‌తో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. కార్యక్రమంలో సహృదయ ప్రధాన కార్యదర్శి కుందావజ్జుల కృష్ణమూర్తి, ఏ.జయశంకర్, అక్కెర సదానందాచారి, మేకల కేదారి, వేదాంతం శ్రీదేవి, భాస్కర్, చక్రవర్తుల శ్రీనివాస్, సహృయసంస్థ కార్యవర్గ సభ్యుడు జులూరు నాగరాజు, కవులు, సాహితీవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.



రేవూరి అనంత పద్మనాభరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కేయూ ఎస్‌డీఎల్‌సీఈ మెయిన్‌గేట్ తాళం తొలగింపు



మెయిన్ గేట్ తాళం తొలగిస్తున్న మల్లేశ్వర్, ఇతర ఉద్యోగులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎస్‌డీఎల్‌సీఈ మెయిన్‌గేట్, మరోగేట్ కూడా కొన్ని సంవత్సరాలుగా తాళాలు వేసి మూసి వేసి ఉంటున్నాయి. ఈ క్రమంలో వీసీ తాటికొండ రమేశ్ పదవీకాలం ముగియడంతో దూరవిద్యాకేంద్రం పరిరక్షణ ఐక్య ఉద్యోగుల సంఘం చైర్మన్ సంగానిమల్లేశ్వర్.. ఇతర ఉద్యోగులతో కలిసి మెయిన్ గేట్ తాళం తొలగించారు. ఆయన మాట్లాడుతూ మాజీ డైరెక్టర్ ఇరువైపులా ఉన్న ద్వారాలు మూసివేయించి కర్కశంగా వ్యవహరించారన్నారు. గేట్లు మూసివేయడం వల్ల ఉద్యోగులు తమ వాహనాలు రోడ్డుపై నిలపాల్సి వస్తోందన్నారు. అంతేగాకుండా విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. వీసీ అండతో ఆ మాజీ డైరెక్టర్ ఉద్యోగుల పట్ల వివక్ష చూపారన్నారు. పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా రెండు గేట్లు మూసివేసి ఉంచారన్నారు. ఈ క్రమంలో మంగళవారం మెయిన్‌గేట్ తాళం బ్రేక్ చేశామన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు డాక్టర్ నల్లాని శ్రీనివాస్, కొట్టెభాస్కర్, పాలెపాక ప్రతాప్, బండివెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సుదయ్య, గౌస్‌పాషా పాల్గొన్నారు. కాగా, ఇక నుంచి రోజూ దూరవిద్య కేంద్రం మెయిన్‌గేట్ ఉదయం 9.30 నుంచి 11గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6గంటల వరకు తెరిచి ఉంచుతామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి రాంచందర్ తెలిపారు.

సివిల్ సప్లై టెండర్లలో కుంభకోణం

- సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పెద్ది, రవీందర్ సింగ్

హన్మకొండ: సివిల్ సప్లై టెండర్లలో రూ.వేల కోట్ల కుంభకోణం జరిగిందని ఆ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు పెద్ది సుదర్శన్ రెడ్డి, రవీందర్ సింగ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. తాము మూడు రోజుల నుంచి సివిల్ సప్లైలో జరిగిన కుంభకోణంపై ఆరోపిస్తున్నా, ప్రశ్నిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. దీంతో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగినట్లు వాస్తవం ఒప్పుకున్నట్లేనన్నారు. తమ వద్ద అన్ని ఆధారాలున్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన సంస్థకు టెండర్ అప్పగించారంటేనే ఇందులో ఏదో మతలబు ఉందని అర్థమవుతోందన్నారు. 2023 మార్చిలో ప్రభుత్వం రెండు సంవత్సరాల పాటు 'కేంద్రీయ' బండార్ అనే సంస్థను బ్లాక్ లిస్టులో పెటిందన్నారు. ఒక్క సారి బ్లాక్ లిస్టులో పెడితే ఎలాంటి టెండర్లలో పాల్గొనొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బ్లాక్‌లిస్టులో ఉన్న ఇదే సంస్థకు రూ.8 వేల కోట్లకు టెండర్లు అప్పగించిందన్నారు. దీని వెనుక ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పెద్దల పాత్ర ఉందన్నారు. దీనిపై ఈ నెల 23న సీఎస్, డీజీపీ, విజిలెన్స్ డీజీపీ, ఏసీబీ, సీబీఐ, ఈడీకి ఫిర్యాదు చేస్తామన్నారు. సమావేశంలో జోరిక రమేష్, బొల్లికుండ వీరేందర్, మనోజ్, ప్రశాంత్, శరత్ చంద్ర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి